ప్రజాశక్తి

శనివారం 18 ఫిబ్రవరి 2023 5 శ్రీకాకుళం





సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక


భారీగా ఓటర్ల నమోదు

- ఎమ్మెల్సీ ఎన్నికలకు 51,033 మంది ఓటర్లు
- కొనసాగుతున్న తొలగింపులు, చేర్పుల ప్రక్రియ
- ఈనెల 23 నాటికి వెలువడనున్న పూర్తిస్థాయి జాబితా
- 2016తో పోలిస్తే 99.36 శాతం పెరుగుదల

ఎమ్మెల్సీ ఓటర్ల తుది జాబితాపై కసరత్తు కొనసాగుతోంది. ఓటర్ల నమోదుకు ఈనెల 13వ తేదీ సాయంత్రంతో ముగిసింది. మరోవైపు డూప్లికేట్లు, నకిలీల తొలగింపు ప్రక్రియ సాగుతోంది. నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది. ఈనెల 23న తుది ఓటర్ల జాబితా విడుదల కానుందని అధికారులు చెప్తున్నారు. దీంతో ఆ రోజు జిల్లాలో ఎంతమంది ఓటర్లు ఉన్నారో తేలనుంది. ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించి జోనల్ అధికారులు, రూట్ అధికారుల జాబితాల తయారీలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే పోలింగ్ స్టేషన్ లోకేషన్, కేంద్రాలు, ఓటర్ల వివరాలతో ఎన్నికల అధికారులకు ప్రతిపాదనలు పంపారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి జిల్లా పునర్ వ్యవస్థీకరణ తర్వాత ఏర్పడిన కొత్త జిల్లా ప్రాతిపదికనే ఓటర్ల జాబితా సిద్ధం చేస్తున్నారు. జిల్లాలోని 30 మండలాల పరిధిలో ఈనెల ఎనిమిదో తేదీ వరకు 51,033 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదయ్యారు. ఓటర్ల నమోదులో అవకతవకలపై ఎన్నికల అధికారులకు జిల్లా నుంచి అనేక ఫిర్యాదులు వెళ్లాయి. వాటిని దృష్టిలో పెట్టుకుని అధికారులు పరిశీలన చేశారు. అందులో అనర్హులను తొలగింపు ప్రక్రియ చేపడుతున్నారు. అర్హులైన ఓటర్లను కొత్తగా నమోదు చేస్తున్నారు. పూర్వపు శ్రీకాకుళం జిల్లాలోని 38 మండలాల పరిధిలో 31,230 మంది ఓటర్లు ఉన్నారు. ఈ జాబితా ఆధారంగానే 2016లో ఎన్నికలు నిర్వహించారు. అప్పట్లో 54 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. తాజాగా జరుగుతున్న ఎన్నికలకు తొలుత 57 కేంద్రాలను సిద్ధం చేశారు. ఓటర్ల సంఖ్య 1400 దాటితే అదనంగా పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్న ఎన్నికల అధికారుల సూచనతో జిల్లా అధికారులు రెండు అదనపు కేంద్రాలను గుర్తించి ఎన్నికల అధికారులకు ప్రతిపాదనలు పంపారు. వాటిలో ఆమదాలవలస, పొందూరు ప్రాంతాలు ఉన్నాయి. దీంతో పోలింగ్ కేంద్రాల సంఖ్య 59కి చేరనుంది.



25,435 మంది ఓటర్లు పెరుగుదల

వచ్చే నెలలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు భారీగా ఓటర్లు నమోదయ్యారు. 2016 ఎన్నికల్లో 38 మండలాల పరిధిలో మొత్తం 31,230 మంది ఓటర్లు ఉన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో చేరిన ఎనిమిది మండలాల్లో మొత్తం 5,632 మంది ఓటర్లు ఉన్నారు. వీరిని మినహాయిస్తే ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 2016 నాటికి 25,598 మంది ఓటర్లే ఉన్నట్లు లెక్క. ప్రస్తుతం 30 మండలాల పరిధిలో 51,033 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదయ్యారు. 2016 ఎన్నికలతో పోలిస్తే 25,435 మంది ఓటర్లు పెరిగారు. ఓటర్ల పెరుగుదల శాతం 99.36 శాతంగా నమోదైంది.

కొన్ని పోలింగ్ కేంద్రాల్లో అసాధారణగా పెరిగిన ఓటర్లు

2016 ఎన్నికలతో పోలిస్తే 2023 ఎన్నికల నాటికి జిల్లాలో ఓటర్ల సంఖ్య రెట్టింపు అయింది. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో మూడు రెట్ల వరకు ఓటర్ల సంఖ్య పెరగడం ఆశ్చర్యకరంగా ఉంది. నగర, పట్టణ ప్రాంతాల్లో ఓటర్లు పెద్దగా పెరకపోగా, మారుమూల మండలాల్లో ఓటర్ల సంఖ్య భారీగా నమోదు కావడం విస్తుగొల్పుతోంది. ఉదాహరణకు ఇచ్ఛాపురం నియోజకవర్గం కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో 2016 ఎన్నికల జాబితాలో 434 మంది ఓటర్లు ఉండగా ప్రస్తుతం వారి సంఖ్య ఏకంగా 1386కు (319 శాతం) పెరిగింది. ఆమదాలవలస నియోజకవర్గం జి.సిగడాం మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రంలో 2016 ఎన్నికల్లో 463 మంది ఓటర్లు ఉండగా ప్రస్తుతం వారి సంఖ్య 1234కి (166.5 శాతం) పెరిగింది. పొందూరులో గతంలో 1399 మంది ఓటర్లు ఉండగా ప్రస్తుతం ఓటర్ల సంఖ్య 2508కి పెరిగింది. ... మండలంలోని జిల్లాపరిషత్ హైస్కూల్ కేంద్రంలో 2016 ఎన్నికల నాటికి 386 మంది ఓటర్లు ఉండగా, ప్రస్తుతం వారి సంఖ్య 1136కు (194.3 శాతం) పెరిగింది. ఎచ్చెర్ల మండలంలోని యూనివర్సిటీ క్యాంపస్ కేంద్రంలో గతంలో 942 మంది ఓటర్లు ఉండగా ఇప్పుడు వారి సంఖ్య 2,112కు (124 శాతం) పెరిగింది. ఈనెల 22న నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ కావడంతో అప్పటివరకు తొలగింపులు, చేర్పుల ప్రక్రియ కొనసాగుతుందని అధికారులు మరోవైపు చెప్తున్నారు. దీంతో తుది జాబితా రావడానికి మరో వారం రోజులు వేచి చూడాల్సి ఉంది.కొద్దిపాటి మార్పులు మినహా పెద్దగా ఉండవని, 50 వేలకు అటుఇటుగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

పోలింగ్ కేంద్రం ప్రాంతం	పోలింగ్ కేంద్రాల సంఖ్య	ఓటర్ల సంఖ్య
కొత్తూరు	1	1190
పాతపట్నం	2	1645
మెళియాపుట్టి	1	837
పలాస మున్సిపాల్టీ, మండలం	3	2,457
మందస	2	1,398
కంచిలి	1	940
ఇచ్ఛాపురం మున్సిపాల్టీ, మండలం	2	1,439
కవిటి	2	1,386
సోంపేట	2	1,384
వజ్రపుకొత్తూరు	1	946
నందిగాం	1	1,308
హిరమండలం	1	747
ఎల్ఎన్‌పేట	1	487
సారవకోట	1	1,065
టెక్కలి	2	2,206
సంతబొమ్మాళి	1	1,017
కోటబొమ్మాళి	2	1,599
జలుమూరు	1	992
సరుబుజ్జిలి	1	1,007
బూర్జ	1	1,267
జి.సిగడాం	1	1,234
ఆమదాలవలస	4	3,054
నరసన్నపేట	3	2,388
పోలాకి	2	1,446
గార	1	1,136
శ్రీకాకుళం రూరల్	2	2,162
శ్రీకాకుళం	8	6,809
పొందూరు	4	2,508
లావేరు	1	1,191
రణస్థలం	2	1,670
ఎచ్చెర్ల	2	2,112
మొత్తం	**59**	**51,033**

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

- ఎస్ఐ ప్రిలిమినరీ పరీక్షకు గంట ముందే చేరుకోవాలి
- ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యాన ఈనెల 19న జిల్లాలో నిర్వహించే సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రిలిమినరీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు నిర్ణీత సమయానికి గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక వెల్లడించారు. పరీక్షా సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని స్పష్టం చేశారు. ఎస్ఐ ప్రాథమిక రాత పరీక్షల నిర్వహణపై జిల్లా పోలీసు కార్యాలయంలో రీజనల్ కోఆర్డినేటర్, చీఫ్ సూపరింటెండెంట్లు, పోలీసు అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. పరీక్షకు శ్రీకాకుళం, ఎచ్చెర్లలో మొత్తం 21 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 9,153 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని చెప్పారు. ఉదయం తొమ్మిది గంటలకే పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులను అనుమతిస్తారని, పది గంటలకు ఒక్క నిమిషం దాటినా ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని స్పష్టం చేశారు. మధ్యాహ్నం నిర్వహించే పరీక్షకు 1.30 గంటలకు పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు. 2.30 గంటలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు చెప్పారు. అభ్యర్థులు హాల్ టిక్కెట్లతో పాటు ఒరిజినల్ ఫొటో గుర్తింపు కార్డు తీసుకురావాలన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, డిజిటల్ వాచ్‌లు తదితర ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించబోమని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో జిరాక్స్ షాపులు తెరవకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్షలకు ఎలాంటి ఆటంకాలు, అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద తప్పక సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎవరైనా అభ్యర్థులు కాపీయింగ్, మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడి పట్టుబడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో పరీక్ష నోడల్ అధికారి డిఎస్‌పి ప్రేమ్ కాజల్, రీజనల్ కోఆర్డినేటర్ వై.శ్రీనివాసరావు, డిఎస్‌పిలు ఎం.మహేంద్ర, బాలరాజు, వాసుదేవ్, సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్లు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల తనిఖీ

ఎస్ఐ ప్రిలిమినరీ రాత పరీక్షకు సంబంధించి ఎచ్చెర్లలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాల, శ్రీకాకుళం నగరంలోని శ్రీచైతన్య టెక్నో స్కూల్ పరీక్షా కేంద్రాలను ఎస్‌పి రాధిక శుక్రవారం పరిశీలించారు. పరీక్షా కేంద్రాల యాజమాన్యాలకు పలు సూచనలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అవసరమైన బందోబస్తును ఏర్పాటు చేయాలన్నారు.

ఆఫ్‌షోర్ పెండింగ్ పనులపై దృష్టి

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని మహేంద్రతనయ ఆఫ్‌షోర్ ప్రాజెక్టు (రేగులపాడు రిజర్వాయర్) పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టిసారించాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధికారులను ఆదేశించారు. ఆఫ్‌షోర్ ప్రాజెక్టు ఆర్అండ్ఆర్ కాలనీల్లో పెండింగ్ పనులపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆఫ్‌షోర్ ప్రాజెక్టు కింద రామకృష్ణాపురం, చీపురుపల్లి, గోపీవల్లభాపురం గ్రామాల నిర్వాసితులకు పూర్తిగా నష్టపరిహారం చెల్లించినట్లు తెలిపారు.

ఆర్అండ్ఆర్ కింద ఆయా గ్రామాల్లో చేపట్టాల్సిన మౌలిక వసతులు, ఇతర సదుపాయాలపై ఎపిఇడబ్ల్యుఐడిసి, ఆర్‌డబ్ల్యుఎస్, నెడ్‌క్యాప్, టెక్కలి ఆర్‌డిఒ, ఇపిడిసిఎల్ శాఖల ద్వారా 38 పనులు అప్పగించినట్లు వివరించారు. అందులో ఇప్పటివరకు 13 పనులు పూర్తి కాగా, 25 పనులు ప్రగతిలో ఉన్నాయని తెలిపారు. ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలతో మాట్లాడి పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టిసారించి పనులు మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. పెండింగ్ బిల్లులపైనా దృష్టిసారించాలన్నారు. పెండింగ్ పనులకు సంబంధించి అవసరమైన నిధులు, పెండింగ్ బిల్లుల అంచనాలను సమర్పించాలన్నారు.

సమావేశంలో ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ బి.నవ్య, సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి, ప్రత్యేక ఉప కలెక్టర్ జి.జయదేవి, వంశధార పర్యవేక్షక ఇంజినీర్ డోల తిరుమలరావు, ఇతర అధికారులు, ఆయా మండలాల తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

మీడియా స్వేచ్ఛపై కేంద్రం దాడి


ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మీడియా స్వేచ్ఛపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దాడి చేస్తోందని ఎపిడబ్ల్యుజెఎఫ్, మీడియా జెఎసి నాయకులు విమర్శించారు. ప్రముఖ మీడియా సంస్థ బిబిసిపై ఐటి దాడులను నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేష్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా నగరంలోని అంబేద్కర్ కూడలి వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్ఎజె జాతీయ కార్యవర్గ సభ్యులు సత్తారు భాస్కరరావు, ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.వేణుగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.లక్ష్మణరావు, మీడియా జెఎసి కన్వీనర్ ఎస్.జోగినాయుడు మాట్లాడుతూ గుజరాత్ మారణహోమానికి సంబంధించి బిబిసి రూపొందించిన డాక్యుమెంటరీని సహించలేక కేంద్ర ప్రభుత్వం ఐటి దాడులతో ప్రతీకార చర్యకు పాల్పడిందని విమర్శించారు. ఢిల్లీలోని ఆ సంస్థ కార్యాలయాలపై ఆదాయపు పన్ను అధికారులు సెర్చ్, సర్వే పేరుతో దాడులకు దిగడం పత్రికా స్వేచ్ఛపై పరోక్ష సెన్సార్‌షిప్‌కు పాల్పడడమేనన్నారు. మీడియా కథనాలపై స్పందించి వివరణ ఇవ్వాల్సిన బాధ్యత ఉన్న కేంద్ర ప్రభుత్వం అందుకు భిన్నంగా ఐటి దాడులు చేయిస్తోందన్నారు. దేశంలో తనపై విమర్శలు చేసే మీడియాను అనేక విధాలుగా వేధింపులకు గురిచేస్తున్న బిజెపి ప్రభుత్వం, ఇప్పుడు తనను విమర్శించే విదేశీ మీడియా పైనా దాడులు చేయడం ద్వారా భారతదేశంలోని పరిస్థితులను ప్రపంచానికి చాటిచెప్తోందని విమర్శించారు. ప్రజాస్వామ్య దేశంలో ఫోర్త్ ఎస్టేట్‌గా పిలవబడే మీడియాను నియంత్రించేందుకు ప్రయత్నాలు చేస్తున్న మోడీ ప్రభుత్వం తగు మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థల మాజీ గవర్నర్ జి.ఇందిరాప్రసాద్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఫెడరేషన్, మీడియా జెఎసి నాయకులు టి.భీమారావు, ఎస్.వి రమణ, ఎస్.రమేష్ కుమార్, సురేష్, ఎ.సోమశేఖర్, టి.బుజ్జిబాబు, ఆర్.ప్రకాశరావు, టెంక శ్రీనివాస్, డోల తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు



అధిక ధరలకు అమ్ముతుంటే ఏం చేస్తున్నారు?

- ఇకెవైసి వెంటనే పూర్తి చేయండి
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు ఎరువులు అమ్ముతుంటే ఏం చేస్తున్నారని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ప్రశ్నించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం యూరియా బస్తాను రైతులకు రూ.260కు ఇస్తుంటే ప్రయివేట్ దుకాణాల్లో రూ.350కు అమ్ముతున్నారని చెప్పారు. ప్రయివేట్ దుకాణాల్లో అమ్మకాలు, ధరలపై ఎన్ని దాడులు చేశారు?, ఎంతమందికి అపరాధ రుసుము విధించారు?, ఎన్నింటిని మూసివేశారని ప్రశ్నించారు. వ్యవసాయ శాఖ చేసే దాడులను బట్టే ధరల నియంత్రణ ఆధారపడి ఉంటుందని చెప్పారు. దీనిపై వ్యవసాయశాఖ ఇన్‌ఛార్జి జెడి భవానీ శంకర్ మాట్లాడుతూ వచ్చే సమావేశం నాటికి దాడుల సమాచారంతో వస్తామని తెలిపారు. రబీలో పంటల సాగు 70 శాతం పడి పోవడానికి కారణమేమిటని వ్యవసాయ శాఖ అధికారులను అడిగారు. నేలలో తేమ శాతం తక్కువగా ఉండడం వల్ల పప్పుధాన్యాలు లక్ష్యం మేరకు సాగు కాలేదని బదులిచ్చారు. జిల్లాలో ఈ-క్రాప్ బుకింగ్ 97 శాతం పూర్తయినా ఇకెవైసి 67 మాత్రమే కావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ వ్యవసాయ అసిస్టెంట్ల కొరత పేరిట ఇకెవైసికి సాకులు చెప్పొద్దని చెప్పారు.

సలహా మండలి సభ్యుడు లోతుగడ్డ తిరుపతిరావు మాట్లాడుతూ పత్తికి ధర రాకుండా వ్యాపారులు కుమ్మక్కు అవుతున్నారని, రైతుల వద్దే పత్తి ఉండిపోయిందని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ అంశంపై కలెక్టర్ స్పందిస్తూ జిల్లాలో పత్తి సాగు, ఉత్పత్తి వివరాలతో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు నివేదిక పంపి జిల్లాలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటయ్యేలా చూడాలని మార్కెటింగ్‌శాఖ ఎడిని ఆదేశించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని పెంచాల్సిన అవసరముందని వ్యవసాయశాఖ ఎడి తిరుమలరావు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. జిల్లాలో ఇప్పటికే 4.77 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, మరో 30 వేల టన్నులకు మించి కొనుగోలు చేయలేమని చెప్పారు. సమావేశంలో ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ నవ్య, వంశధార ప్రాజెక్టు ఎస్ఇ డోల తిరుమలరావు, జలవనరులశాఖ ఇఇ సుధాకరరావు, మత్స్యశాఖ ఎడి పి.వి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్



ఎన్నికల వరకే చేరికలు

- తరువాత తాళాలు వేసేస్తాం
- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

ఎన్నికల వరకే తెలుగుదేశం పార్టీలోకి చేరికలు ఉంటాయని, ఆ తర్వాత చేరికల తలుపులకు తాళాలు వేసేస్తామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. వమండలంలోని మహాదేవిపురంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క అవకాశం అంటూ ప్రజలను మోసగించి అధికారంలోకి వచ్చిన సైకోలు రాష్ట్రాన్ని లూటీ చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల్లో డబ్బులు పంచడానికి రూ.రెండు వేల నోట్లు బ్లాక్ చేసి ఇడుపులపాయ బంకర్లలో దాచుకుంటున్నారని ఆరోపించారు. ప్రజల నుంచి దోచుకున్న ఆ డబ్బును తీసుకొని వచ్చే ఎన్నికల్లో వైసిపికి బొమ్మ చూపించాలన్నారు. ఈ ప్రభుత్వం ఎప్పుడు పోతుందా అని ప్రజలు ఎదురుచూస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో టిడిపి 160 స్థానాలతో అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జగన్ రెడ్డి ఇక రోజులు లెక్క పెట్టుకోవాలన్నారు.

ఎంపీ కె.రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ వైసిపి పాలనలో అన్ని వర్గాల ప్రజలూ అసంతృప్తితో ఉన్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు అధికారంలోకి వస్తే జగన్మోహన్ రెడ్డి జైలు ఊచలు లెక్కించడం ఖాయమన్నారు. సభాధ్యక్షులు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష మాట్లాడుతూ పలాస నియోజకవర్గంలో మంత్రి అప్పలరాజు కొండలను కొల్లగొడుతూ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. 65 ఏళ్లుగా పాలించిన గౌతు కుటుంబం ప్రకృతి వనరులను కాపాడితే, మంత్రి మూడేళ్లలో కొండలను మాయం చేస్తున్నారన్నారు. అనంతరం అచ్చెన్నాయుడు సమక్షంలో 70 కుటుంబాలు టిడిపిలో చేరాయి. కార్యక్రమంలో ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, పార్టీ జిల్లా మాజీ అధ్యక్షులు చౌదరి బాబ్జీ, మాజీ ఎంపిపి జి.వసంతస్వామి, దువ్వాడ కృష్ణమూర్తి నాయుడు, పలాస మున్సిపల్ మాజీ చైర్మన్ వజ్జ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, వైఖరి మార్చుకోకపోతే ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమవుతామని ఎపి జెఎసి అమరావతి జిల్లా అధ్యక్షులు కె.శ్రీరాములు హెచ్చరించారు. నగరంలోని రెవెన్యూ అతిథిగృహంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక విశ్రాంత, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఈనెల 26న రాష్ట్ర కార్యవర్గంలో చేపట్టనున్న ఉద్యమ కార్యాచరణలో జిల్లాలోని ఉద్యోగులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఉద్యోగులు సొంత అవసరాల కోసం దాచుకున్న డబ్బులను అవసరానికి చెల్లించకపోవడంతో పిల్లల పెళ్లిళ్లు వాయిదాలు పడుతున్నాయని, దీర్ఘకాలిక వ్యాధులు నయం చేయించుకోలేక, సొంత ఇల్లు మరమ్మతులు చేయించుకోలేని పరిస్థితులు ఉన్నాయన్నారు. పిఆర్‌సి అమలు తేదీ 1.4.2020 నుంచి 31.12.2021 మధ్య కాలానికి అరియర్స్ వెంటనే చెల్లించేలా చర్యలు చేపట్టాలని, 2018 నుంచి పెండింగ్ డిఎలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కొత్త పిఆర్‌సికి కమిటీని ఇంతవరకు నియమించలేదన్నారు. ఆర్‌టిసి ఉద్యోగులకు విలీనానికి ముందున్న సర్వీస్ రూల్స్, మెడికల్ సౌకర్యాలు యథాతథంగా అమలు చేయాలన్నారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. సమావేశంలో అమరావతి జెఎసి అసోసియేట్ చైర్మన్ పి.లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరమణ, రెవెన్యూ సర్వీసుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పప్పల వేణుగోపాలరావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి బి.వి.వి.ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మార్చి 19న రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మార్చి 19న శ్రీకాకుళం నగరంలో నిర్వహించే 25వ మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్-2023 పోటీల పోస్టర్‌ను రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు పెద్దపాడులోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు వరుసగా తొమ్మిది రాష్ట్రస్థాయి పోటీలకు శ్రీకాకుళం ఆతిథ్యం ఇవ్వడం అభినందనీయమన్నారు. నేటి ఆధునిక అలవాట్ల నేపథ్యంలో ప్రతిఒక్కరూ వ్యాయామం తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలన్నారు.

ఎపి బాడీ బిల్డర్స్ అసోసియేషన్ అసోసియేట్ సెక్రటరీ వి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ మార్చి 19న శ్రీకాకుళం నగరంలో ఛాంపియన్‌షిప్ పోటీల్లో విజేతలకు రూ.1,15,000 నగదు ప్రోత్సాహకాలను ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు, హారికా ప్రసాద్, చిట్టి జనార్ధనరావు, బాడీబిల్డింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బి.ప్రసాద్, కాపవరపు సీజు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఆమదాలవలస : ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఎఆర్ఎస్‌లు, ఆర్ఎఆర్‌లు, కృషి విజ్ఞాన కేంద్రంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఉపాధ్యక్షులు కె.నాగమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక వ్యవసాయ పరిశోధనా స్థానం వద్ద సిఐటియు ఆధ్వర్యాన కాంట్రాక్టు కార్మికులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆచార్య ఎన్‌జి రంగా పరిధిలోని రీసెర్చ్ స్టేషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల వివరాలను నమోదు చేయాలని, అవుట్‌సోర్సింగ్ కార్పొరేషన్‌లో చేర్చాలని కోరారు. సంవత్సరం మొత్తం పని కల్పించాలని కార్యాలయాల్లో స్వీపర్, అటెండర్ పోస్టుల్లో ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవుట్‌సోర్సింగ్ కార్మికులకు అమలు చేస్తున్న ప్రమాద, సహజ మరణ నష్టపరిహారాన్ని కాంట్రాక్టు కార్మికులకూ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికశాఖ ఆదేశాల ప్రకారం జాతీయ, పండగ సెలవులను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మికులు వెంకటరావు, సూర్యనారాయణ, గణపతి, తేజ, చిట్టిబాబు, సునీత, సీతాలక్ష్మి, మల్లేశ్వరి, శ్రావణ సంధ్య తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు కార్మికులు

మరిన్ని వార్తల కోసం epaper.prajasakti.com

రేషన్ డీలరుపై విచారణ



లబ్ధిదారులతో మాట్లాడుతున్న డిటి రాము

ప్రజాశక్తి - సంతబొమ్మాళి

మండలంలోని జగన్నాథపురంలో 49 మంది లబ్ధిదారులకు రెండు నెలలుగా రేషన్ డీలర్ సరుకులు పంపిణీ చేయకుండా నల్ల బజారుకు తరలిస్తున్నట్లు ఈనెల 13న సబ్ కలెక్టర్‌కు సర్పంచ్ జోగి రాములమ్మ, గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు సివిల్ సప్లై డిటి రాము శుక్రవారం జగన్నాథపురం పంచాయతీ కార్యాలయంలో డీలరు అక్రమాలపై విచారణ చేపట్టారు. లబ్ధిదారులు హాజరైనా, డీలరు సరోజిని రాకపోవడంతో విచారణను ఈ నెల 20వ తేదీకి వాయిదా వేశారు. ఆ రోజు కూడా డీలరు అందుబాటులో లేకుంటే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జోగి రాములమ్మ, మత్స్యకార సహకార సంఘం అధ్యక్షులు పుక్కళ్ల లక్ష్మణరావు, విఆర్ఒ బి.ప్రసాద్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అణుపార్కును రద్దు చేయాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి-రణస్థలం

కొవ్వాడలో నిర్మించతలపెట్టిన అణు విద్యుత్కేంద్రాన్ని తక్షణమే రద్దు చేయాలని ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం కొవ్వాడలో ఎఐవైఎఫ్ మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొవ్వాడలో అణు విద్యుత్ పార్క్ ఏర్పాటుతో ఈ ప్రాంతానికి తీవ్ర పర్యావరణ ఇబ్బందులు కలుగుతాయని అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు, రాష్ట్రానికి పరిశ్రమలు వచ్చి ఉద్యోగ కల్పనకు అవకాశం ఉండేదని అన్నారు. అనంతరం ఎఐవైఎఫ్ కమిటీని ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షులుగా మైలపల్లి సతీష్, కార్యదర్శి చీకటి వేణు, సహాయ కార్యదర్శులుగా మైలపల్లి సత్యం, రాముడు, ఎర్రయ్య, కె.పోలయ్య, అప్పన్న, లక్ష్మణ, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



విద్యార్థులను పరామర్శిస్తున్న ఆనందరావు, ఓంకార్

ప్రజాశక్తి - పలాస

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరమని ఆరోగ్య పరిరక్షణ వేదిక నాయకులు బి.ఓంకార్, కౌలు రైతు సంఘం నాయకులు బి.ఆనందరావు అన్నారు. జ్యోతిరావు పూలే హాస్టల్ విద్యార్థులను వారు శుక్రవారం పరామర్శించారు. ప్రభుత్వం సన్న బియ్యం సరఫరా చేస్తామని చెప్పి ఎక్కువ రోజులు నిల్వ ఉన్న ముదక రకం బియ్యంతో వండిన అన్నదం విద్యార్థులకు పెట్టడం వల్ల అస్వస్థతకు గురయ్యారని అన్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. మెనూలో పౌష్టికాహారం కనిపించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు పూర్తిగా కోలుకునే వరకు ప్రతేక అధికారి పర్యవేక్షణలో ఉంచాలని కోరారు. 202 మంది విద్యార్థులు ఉన్నా స్నానాలు చేయడానికి కనీసం నీటి సదుపాయం లేదన్నారు. నాణ్యమైన బియ్యం, పప్పులు, కూరగాయలు, పండ్లు, గుడ్లు సరఫరాలో మెనూలో ప్రమాణాలు పెంచాలని కోరారు. వారితో పాటు దుబ్బ భానుమతి ఉన్నారు.




జలుమూరు : విద్యుత్ కాంతుల్లో శ్రీముఖలింగేశ్వర ఆలయం



శ్రీముఖలింగం ఆలయం లోపల షామియానాలు ఏర్పాటు చేసిన అధికారులు

శివరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి - జలుమూరు



దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగంలో నేటి నుంచి 20వ తేదీ వరకు మహాశివ రాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శివరాత్రి నాడు స్వామి వారికి శాశ్వత ధర్మకర్త పర్లాకిమిడి మహారాజు గోపీనాథ గజపతి పేరున ప్రత్యేక అభిషేకం నిర్వహిస్తారు. రాత్రి 12 గంటలకు లింగోద్భవ కార్యక్రమం, నిజరూప దర్శనం, పాగా పంచాల ధారణ, శిఖర దీపారాధన, గజవాహనంపై తిరువీధి నిర్వహిస్తారు. 19వ తేదీ ఆదివారం పడియా మహోత్సవం, స్వామివారికి అభిషేకములు, దర్శనములు, వారాహి అమ్మవారికి విశేష కుంకుమార్చనలు నిర్వహిస్తారు. 20వ తేదీ సోమవారం మధ్యాహ్నం 1:40 నిమిషాలకు పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను నంది వాహనంపై సుందరంగా అలంకరించి శ్రీముఖలింగం క్షేత్రానికి ఉత్తర దిశగా మంగళ వాయిద్యాలు నడుమ పవిత్ర వంశధార నదీ పరివాహక ప్రాంతానికి తీసుకువెళ్లి తీర్థ ఘట్టంలో అర్చక స్వాముల వేదమంత్రోచ్ఛారణల మధ్య లక్షలాది యాత్రికుల శివనామస్మరణల మధ్య ప్రభుత్వ లాంచనాలతో స్వామివారి చక్రతీర్థ స్నానం చేయిస్తారు. సాయంత్రం 7 గంటలకు స్వామివారి లింగాభరణ కార్యక్రమం నిర్వహిస్తారు.

ఏర్పాట్లు పూర్తి

ఉత్సవాల సందర్భంగా శ్రీముఖలింగం ఆలయ ప్రాంగణంలో షామియానాలు, తాగునీరు సౌకర్యం కల్పించినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి పి.ప్రభాకర్‌రావు తెలిపారు. క్యూలైన్లో వేచి ఉన్న చిన్నారులకు పాలు, బిస్కెట్లు, స్వామివారి దర్శనం చేసుకున్న ప్రతి యాత్రికునికీ ఉచిత ప్రసాదం అందజేస్తామన్నారు. ప్రత్యేక దర్శనం టికెట్ రూ.20లకు విక్రయిస్తున్నామన్నారు.

ఉత్సవాలకు భారీ బందోబస్తు : డిఎస్‌పి

శ్రీముఖలింగంలో శనివారం నుంచి 20వ తేదీ సోమవారం వరకు నిర్వహించే శివరాత్రి ఉత్సవాలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పలాస డిఎస్‌పి ఎం.శివరామిరెడ్డి తెలిపారు. శ్రీముఖలింగంలో మహ శివరాత్రి ఉత్సవ ఏర్పాట్లను ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా శ్రీముఖలింగేశ్వరుని దర్శనార్థం వచ్చే ప్రతి యాత్రికునికీ స్వామి దర్శనం కలిగేలా చర్యలు చేపట్టామన్నారు. యాత్రికులను నేరుగా ఆలయంలోకి ప్రవేశం కల్పించడానికి ప్రత్యేక, ఉచిత దర్శనాలకు వేర్వేరు బారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు. శివరాత్రి ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఉండేందుకు 560 మందితో గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నట్లు డిఎస్‌పి తెలిపారు. మహాశివరాత్రి రోజు 280 మంది పోలీసులతో, మూడవ రోజు స్వామివారి చక్రతీర్థ స్నానాల రోజు అదనంగా మరో 280 మందితో బందోబస్తు నిర్వహిస్తామన్నారు. చక్ర తీర్థస్నానాల రోజున 6 నుంచి 7 వరకు రోప్ పార్టీలు వినియోగిస్తామన్నారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బందితో సమావేశమై వారికి దిశా నిర్దేశం చేశారు.

ప్రతి ఏటా ఎండలోనే యాత్రికులు

ఈ ఏడాది కూడా శ్రీముఖలింగేశ్వరుని దర్శనానికి వచ్చే యాత్రికులకు తిప్పలు తప్పినట్లు కనిపించడం లేదు. ప్రతి ఏడాదీ శివరాత్రి ఉత్సవాలకు ఆలయ ప్రాంగణంలో మాత్రమే షామియానాలు ఏర్పాటు చేస్తున్నారు. యాత్రీకులు అధికంగా తరలివచ్చే సమయంలో ఇవి సరిపోక యాత్రికులు ఎండలోనే నిరీక్షించాల్సి వస్తోంది. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి కనిపిస్తోంది. ఆలయం బయట క్యూ లైన్‌లో వేచి ఉండే యాత్రికుల కోసం నీడ సౌకర్యం కల్పించాలని ముందుగానే ఎస్ఐ పి.పారినాయుడు దేవదాయశాఖ అధికారులకు సూచించారు. అయినప్పటికీ ఆ దిశగా దేవాదాయశాఖ అధికారులు ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదు. ఆలయ, పోలీసు అధికారులు దీన్ని ఏ విధంగా అధిగమిస్తారో చూడాల్సి ఉంది.

'స్వర్ణ'లింగం

ప్రజాశక్తి - పలాస



కాశీబుగ్గ 21వ వార్డు గాంధీ నగర్‌కు చెందిన సూక్ష్మ కళాకారులు కొత్తపల్లి రమేష్ ఆచారి 0.25 మిల్లీ గ్రాముల ఎత్తు, అర సెంటీమీటరు వెడల్పు, అర సెంటీమీటర్ కొలతలతో అతి సూక్ష్మ స్వర్ణ లింగం సూది బెజ్జంపైన నిల్చునేలా తయారు చేశారు. దీని తయారీకి గంట సమయం పట్టినట్లుగా తెలిపారు. దీనికి ఎటువంటి అతుకులు లేవని, పలుచటి బంగారు రేకుపైన తయారు చేసినట్లుగా తెలిపారు. మహాశివరాత్రి మహోత్సవం సందర్భంగా దీన్ని తయారు చేసినట్లు తెలిపారు.

ఉత్సవాలకు ఎండల మల్లన్న సిద్ధం

టెక్కలి రూరల్: అరుదైన చారిత్రక సంఘటనలకు, ఆధ్యాత్మిక విగ్రహాలకు నెలవు తెలుగునేల. ప్రాచీనకాలం నాటి శివలింగాలన్నీ చిన్నగానే ఉండేవి. అవన్నీ స్వయంభూ లింగాలు కూడా. స్వయంభూ శివలింగాలలో అతిపెద్దది జిల్లాలోని రావివలసలో ఉంది. మన దేశంలోనే పెద్దదైన ఈ శివలింగం మన జిల్లాలో ఉండటం విశేషం. టెక్కలికి 6కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామంలో వెలసిన స్వామియే మల్లికార్జునుడు, ఆ గ్రామమే రావివలస. ఈ రావివలసలో ఉన్న ఈ అతిపెద్ద స్వయంభూ లింగం గురించి కొద్దిమందికే తెలుసు. దాని ఎత్తు 55 అడుగులు. అందువల్ల ఇచ్చడ గోపురం ఉండదు. స్వామి ఎప్పుడూ ఎండలో ఉండాల్సిందే. అందుకే ఈ స్వామిని ఎండల మల్లికార్జునుడు అనే పేరు ప్రసిద్ధి చెందింది. శివరాత్రి సందర్భంగా ఆలయానికి వెళ్లేందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. సిఐ చంద్రమౌళి, ఎస్ఐ ఎల్.రామకృష్ణ ఆధ్వర్యాన బందోబస్తు నిర్వహించారు. యాత్రికులు ఇబ్బంది పడకుండా షామాయానాలను ఏర్పాటు చేశారు.



షామియానాలు వేసిన ఆలయ అధికారులు

అలరించనున్న సాంస్కృతిక కార్యక్రమాలు

మహాశివరాత్రి సందర్భంగా శ్రీముఖలింగంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఇఒ పి.ప్రభాకర్‌రావు తెలిపారు. 18వ తేదీ శనివారం మహాశివరాత్రి సందర్భంగా రాత్రి 10:30 గంటలకు శ్రీ వెంకటేశ్వర నక్షకళా మండలి రాష్ట్రస్థాయి కళాకారులు బొబ్బిలి వారితో గయోపాఖ్యానం యుద్ధం సీను, అనంతరం శ్రీ రామాంజనేయ యుద్ధం, 19వ తేదీ ఆదివారం రాత్రి 10గంటలకు శ్రీ వెంకటేశ్వర నాట్య కళామండలి రాష్ట్రస్థాయి కళాకారులతో సత్య హరిచంద్ర పౌరాణిక నాటకం ప్రదర్శింపబడునని ఇఒ చెప్పారు.

ఆలయానికి ఎలా చేరాలి

శ్రీకాకుళం నుండి నరసన్నపేట, చల్లవానిపేట మీదుగా ఆర్టీసీ అధికారులు ఆర్టీసీ బస్సులు నడుపుతారు. నరసన్నపేట, చల్లవానిపేట నుండి ఆటోలు, ట్రక్కులు, మినీ బస్సులు ఉంటాయి. రైలులో వచ్చే వారు ఆముదాలవలస లేదా, తిలారు రైల్వేస్టేషన్‌లో దిగి బస్సులు, ఆటోలు, మినీ బస్సుల్లో ఆలయానికి చేరుకోవచ్చు.

సంక్షిప్త వార్తలు

మానసిక రోగులకు ఆపన్నహస్తం



మానసిక రోగులను ఇంటికి చేర్చుతున్న లోకశ్వరరావురెడ్డి

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

మానసిక రోగులకు ఆపన్న హస్తం అందించారు. ఇచ్ఛాపురానికి చెందిన రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ లోకేశ్వరరావు రెడ్డి జిల్లాలో పర్యటించిన సమయంలో ఐదుగురు మానసిక వికలాంగులను గుర్తించారు. మనో బంధు ఫౌండేషన్ జిల్లా అధ్యక్షులు బీన ఢిల్లీరావు సహాయంతో వారిని విశాఖలోని మానసిక వైద్యశాలకు తరలించి, చికిత్స అందించారు. కోలుకున్న వారిని సొంత ఇంటికి చేర్చారు. గతంలో టిబి రోగులకు కూడా సేవలు అందించారు. ఉపాధ్యాయునిగా ఉద్యోగ విరమణ తరువాత కూడా సేవా కార్యక్రమాలు చేపట్టడంపై పలువురు అభినందనలు తెలుపుతున్నారు.

ఎంపీ పరామర్శ



పరామర్శిస్తున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు

ప్రజాశక్తి - బూర్జ

మండలంలోని అల్లిన గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఎంపిటిసి వావిలపల్లి శ్రీరామ వరప్రసాదమ్మ కుటుంబ సభ్యులను ఎంపీ రామ్మోహన్‌నాయుడు శుక్రవారం పరామర్శించారు ఈ సందర్భంగా రాంప్రసాదమ్మ కుమారుడు వావిలపల్లి సీతారాంబాబునాయుడును మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు ఆయనతోపాటు ఎ.రామకృష్ణ, మజ్జి శ్రీరాములు, లంక జగన్నాథంనాయుడు, సర్పంచ్ ప్రతినిధి ఎ.గణపతిరావు, జి.హరిబాబు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యం అవసరం

ప్రజాశక్తి - టెక్కలి

బాలికల్లో ఆత్మస్థైర్యం అవసరమని విశ్రాంత ఉపాధ్యాయులు దల్లి వీరాస్వామిరెడ్డి, దూసి ఆంధ్రాస్టాలిన్, ఎ.చిట్టెన్న అన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో శుక్రవారం చిన్నారి చేదోడు చేపట్టారు. విద్యార్థులతో మాట్లాడుతూ చదువపై శ్రద్ధ చూపుతూనే తమ లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని, చేరుకునే దిశగా కృషి చేయాలన్నారు. ఎస్ఐ రామకృష్ణ, ప్రిన్సిపాల్ దామోదరరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో నూతనత్వాన్ని తీసుకొచ్చేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం



బాండ్‌ను అందిస్తున్న బ్యాంకు మేనేజరు, తదితరులు

ప్రజాశక్తి - బూర్జ

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బ్యాంకు ఉద్యోగి నందికేశ్వరరావు కుటుంబానికి యూనియన్ బ్యాంఉ అధికారులు రూ.3.50 లక్షలు శుక్రవారం అందించారు. మృతుడు బిజినెస్ కరస్పాండెంట్‌గా సేవలు అందజేశారు. ఆయన మృతి చెందడంతో బ్యాంకు మేనేజరు సూర్యకిరణ్, సిబ్బంది, కస్టమర్లు పై మొత్తాన్ని విరాళంగా సేకరించి, మృతుని పిల్లలు రాఘవ పేరున ఎఫ్‌డి చేశారు. ఆ పత్రాలను భార్య సత్యవతికి అందజేశారు.

అలరించిన చిన్నారుల నృత్యాలు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

స్థానిక సురంగి రాజా మైదానంలో జరుగుతున్న ఓం శాంతి సిల్వర్ జూబ్లి ఉత్సవాల్లో భాగంగా శ్రీ వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ చిన్నారుల నృత్యాలు అలరించాయి. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మిని, కమిషనర్ రమేష్‌ను వారు శుక్రవారం సత్కరించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

స్పీకర్ తమ్మినేని సీతారాం



వైసిపి నాయకులతో సమీక్షిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వైసిపి నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని స్పీకర్ తమ్మినేని సీతారాం దిశా నిర్దేశం చేశారు. శుక్రవారం మండలంలోని తొగరాం గ్రామంలోని స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో పొందూరు మండలం కొంచాడ, బొడ్డేపల్లి గ్రామాల వైసిపి నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కేడర్ మధ్య ఎటువంటి బేదాభిప్రాయాలు లేకుండా పార్టీ పటిష్టతకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఐక్యతతో పార్టీ ఉన్నతికి, పటిష్టతకు భాగస్వాములుగా నిలవాలన్నారు. గ్రామాల్లో ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి పనులను నేతలకు వివరించారు. జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తున్నామని, గ్రామాల్లో ప్రతిపాదించిన ప్రతి చోటా రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలల ఆధునీకరణ సుందరీకరణ ప్రక్రియ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను వివరించారు.

వెల్నెస్ సెంటర్ల ద్వారా గ్రామాల్లో ప్రాథమిక వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చామని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పెన్షన్ అందజేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో ఏవైనా అభివృద్ధి పనులు చేపట్టాలంటే, తన దృష్టికి తీసుకురావాలని కోరారు. పార్టీ ఉన్నతే లక్ష్యంగా కిందిస్థాయి కేడరు సమన్వయం చేసే బాధ్యత గ్రామస్థాయి ముఖ్య నేతలపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కిల్లి నాగేశ్వరరావు, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, పప్పల రమేష్‌కుమార్, బొడ్డేపల్లి సర్పంచ్ రమణ, కొంచాడ సర్పంచ్ అనురాధ, నాయకులు బొడ్డేపల్లి చంద్రశేఖర్, తవిటిరాజు, ఎ.ఢిల్లీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - ఆమదాలవలస

ఆన్‌లైన్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ అన్నారు. మండలంలోని తురకపేట గ్రామంలో యూనియన్ బ్యాంక్ సౌజన్యంతో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో ఆర్థిక అక్షరాస్యతపై కళాజాతా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎవరైనా బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని, మీ బ్యాంకు వివరాలు అడిగితే సమాచారం ఇవ్వవద్దని అన్నారు. ఎటిఎంలో అపరిచితులకు డబ్బులు విత్‌డ్రా చేసి, పెట్టాలని ఎటిఎం కార్డు ఇవ్వకూడదని అన్నారు. పిఎం జీవనజ్యోతి బీమా యోజన, తదితర పథకాలను వివరించారు. సైబర్ మోసాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు, ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మెన్ 14448 టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఎం.శ్రీనివాసరావు, సిఎఫ్ఎల్ సిబ్బంది రామారావు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు సన్మానం

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

మండలంలోని పెద్దబాడం ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేసి ఉద్యోగోన్నతిపై నందిగాం మండలం హరిదాసుపురం జెడ్‌పి ఉన్నత పాఠశాలకు ఆంగ్ల అసిస్టెంట్‌గా వెళ్లిన బల్ల చిట్టిబాబును గ్రామస్తులు, సహ ఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ బదిలీపై వెళ్తున్న చిట్టిబాబు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వజ్రపుకొత్తూరు ఎంఇఒ డి.తులసిరావు, గ్రామ సర్పంచ్ పీత మోహన్‌రావు, ఉప సర్పంచ్ ఉమామహేశ్వరరావు, లక్ష్మీనారాయణరెడ్డి, హెచ్‌ఎం జయలక్ష్మి, ఉపాధ్యాయులు కుమారి, తదితరులు పాల్గొన్నారు.



చిట్టిబాబును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

సిపిఎస్‌ను తక్షణమే రద్దు చేయాలి

ప్రజాశక్తి - పలాస

రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్‌ను తక్షణమే రద్దు చేయాలని ఎపిటిఎఫ్ 257 జిల్లా ప్రధాన కార్యదర్శి బల్ల సుభాష్‌బాబు డిమాండ్ చేశారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం సాయంత్రం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నాలుగు ఐదు తరగతులను విలీనం చేయొద్దని కోరారు. ఒకటో తేదీ నాటికి ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పిఆర్‌సిని అమలు చేయాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీనారాయణకు వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పి.వి.రమణ, కె.గోపికృష్ణ, పలాస మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి టి.రామన్నాయుడు, నారాయణ, కె.జగదీష్, వెంకటరావు, సోమేష్, తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎపిటిఎఫ్ ఈ నెల 14 నుంచి 17 వరకు మండలాల్లో దశలవారీ ఉద్యమం చేపట్టిందని ఎపిటిఎఫ్ మండల అధ్యక్షులు మొగదాల రమణారావు అన్నారు. అందులో భాగంగా ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి చొరవచూపాలంటూ తహశీల్దార్ రాంబాబుకు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ నెల 21 నుంచి 23 వరకు పాత తాలూకా కేంద్రాల్లో, మార్చిలో జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ నాయకులు కోరుకొండ విజయ్‌కుమార్, దుంప రవికుమార్, పప్పల తిరుమలరావు, బసవ సతీష్, దున్న ఈశ్వరరావు, అల్లాడ అప్పలరాజు, ఆరవెల్లి హేమ సుందరరావు, కోరుకొండ కోటేశ్వరరావు, కనకరావు, యు.వి.రమణారావు, తూతిక శ్రీనివాసరావు, అనకాపల్లి అప్పన్న, కాపల వెంకటరావు, పైడి రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

పిజి విద్యార్థుల ఫ్రెషర్స్ డే

శ్రీకాకుళం అర్బన్: ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ విభాగం పిజి ఆర్గానిక్ కెమిస్ట్రీలో విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వి సత్యనారాయణ మాట్లాడుతూ సోదర భావంతో మెలిగేందుకు ఫ్రెషర్స్ డే తోడ్పడుతుందన్నారు. రసాయన శాస్త్రంలో బంధాలు లాగే మానవ జీవితం కూడా అనుబంధాల సమ్మేళనమన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పిజి కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ ఎస్.రామకృష్ణ, కళాశాల అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఎన్.సూర్యప్రకాష్, రసాయన శాస్త్ర విభాగాధిపతి డి.ఆదినారాయణ, రసాయన శాస్త్ర అధ్యాపకులు రవికుమార్, ఐక్యుఎసి కోఆర్డినేటర్ డాక్టర్ శాంతిదేవి తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

అరసవల్లి సందర్శించిన మాజీ ఎంపీ



అప్పలసూర్యనారాయణ దంపతులతో పార్థసారథి

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

తెలుగుదేశం పార్టీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంపీ బి.కె పార్థసారథి అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని శుక్రవారం సందర్శించారు. అనంతరం అరసవల్లిలో మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, లక్ష్మీదేవి దంపతుల నివాసానికి చేరుకుని మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు సత్యసాయి జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్, మాజీ జెడ్పిటిసి రామ్మూర్తి, టిడిపి అధికార ప్రతినిధి మహేష్ చౌదరి, అనిల్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

టిడిపి వారే టిడిపిలో చేరడం సిగ్గుచేటు

వజ్రపుకొత్తూరు: టిడిపి వారే టిడిపిలో చేరి, ఏదో చేరికలు జరిగినట్లు ఆ పార్టీ నాయకులు చెప్పడం సిగ్గుచేటు అని వైస్ ఎంపిపి తమ్మినాన శ్రావణి, నాయకులు టి.శాంతారావు ఎద్దేవా చేశారు. శుక్రవారం మహాదేవిపురంలో వారు విలేకరులతో మాట్లాడారు. టిడిపి వారిని చేర్చుకోడానికి సాక్షాత్తు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు రావడం టిడిపి దిగజారుడు రాజకీయాలకు అద్దం పడుతోందన్నారు. అచ్చెన్న సమయంలో ఒక సారి పార్టీలో చేరిన వారిని మళ్లీ చేర్చుకొని, ఏవే చేరికలు జరిగాయని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గ్రామంలో అభివద్ధి మాజీ ఎంపీ హనుమంతు అప్పయ్యదొర హయాంలోనే జరిగిందని గుర్తు చేశారు. ఎప్పటికీ దొర కుటుంబానికి గ్రామం రుణపడి ఉంటుందన్నారు. సమావేశంలో ఉప సర్పంచ్ సుశీల, టి.ప్రణీత్‌కుమార్, దివ్వల పాపయ్య, నాగేశ్వరరావు, సిహెచ్ దుర్గ, సురేష్, టి.కృపాకర్, దమయంతి, యశోద, సంతోష్, తాత, సురేష్ పాల్గొన్నారు.

ప్రజల కష్టాలు తీరాలంటే బాబు రావాలి

మాజీ మంత్రి కళా వెంకటరావు

ప్రజాశక్తి - జి.సిగడాం

ప్రజల కష్టాలు తీరాలంటే బాబు మళ్లీ సిఎం కావాలని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కళా వెంకటరావు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ప్రజా సమస్యలను కళా అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో పెరిగిన నిత్యావసరసరుకుల ధరలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వీటిని అదుపు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు రవికుమార్, మజ్జి హరిబాబు, జె.దాసు, బి.అప్పలనాయుడు, శ్రీరామ్మూర్తి, పి.రామకృష్ణ, సర్పంచ్‌లు వెంటకరావు, చిన్నారావు, పెనసాం బుజ్జి, ముసలినాయుడు, బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.



ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొన్న కళా వెంకటరావు

అరసం జిల్లా కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నల్లి ధర్మారావు, చింతాడ కష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. సంఘ గౌరవాధ్యక్షులుగా కవి, రచయిత, విద్యా సంస్థల అధినేత పేడాడ పరమేశ్వరరావు (టెక్కలి), గౌరవ సలహాదారుగా అరుణ్ బవేరా (శ్రీకాకుళం), ఉపాధ్యక్షులుగా విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతి ఫ్రెడరిక్ (నరసన్నపేట), మరడాన శ్రీనివాసరావు (శ్రీకాకుళం), కార్యదర్శిగా బొడ్డేపల్లి కనకలక్ష్మి (ఆమదాలవలస), కార్యనిర్వాహక కార్యదర్శిగా కలమట దాసుబాబు (శ్రీకాకుళం), సంయుక్త కార్యదర్శులుగా వాండ్రంగి కొండలరావు (పొందూరు), మామిడి కోదండరావు (మందస), మద్దెల కేశవరావు (ఇచ్ఛాపురం), కోశాధికారిగా కె.భాస్కరరావు (కోటబొమ్మాళి), సమన్వయకర్తగా ఎంవీ మల్లేశ్వరరావు (శ్రీకాకుళం), కార్యవర్గ సభ్యులుగా పులి చంద్ర, పూతి చంద్ర భూషణరావు (కొరసవాడ), చిట్టి వెంకటరావు (శ్రీకాకుళం), గేదెల హరికష్ణ (ఆమదాలవలస), మాడుగుల సుజాత (శ్రీకాకుళం)లు నియమితులయ్యారని తెలిపారు.

రేపటి విజయానికి మీరే వారధులు



ఏటిఎంను ప్రారంభిస్తున్న అచ్చెన్న, రామ్మోహన్‌నాయుడు

ఎస్‌బిఐ సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

ఎస్‌బిఐ సేవలను ఖాతాదారులు సద్వినియోగించుకోవాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడు అన్నారు. శుక్రవారం నిమ్మాడలో ఎస్‌బిఐ ఏటిఎంను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌బిఐ ఖాతాదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకునే ఏటిఎంను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో కింజరాపు హరివరప్రసాద్, మెండ దాలినాయుడు, లాయర్ అచ్చెన్నాయుడు, ఎం.బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జగన్ ఆదేశిస్తే స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా పోటీ

వైసిపి నాయకులు హనుమంతు కిరణ్

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

వైసిపి ఆవిర్భావం నుంచి క్రియాశీలక సేవలందిస్తున్నానని, ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి తనపై నమ్మకంతో ఆదేశిస్తే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తానని వైసిపి నాయకులు హనుమంతు కిరణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రిని కోరారు. అధిష్టానం ఆదేశిస్తే నామినేషన్ వేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. రాజకీయ ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని తనకు అవకాశం ఇవ్వాలని కోరారు.

మహా శివరాత్రి ఉత్సవాలకు విరాళం

టెక్కలి రూరల్: తిర్లంగి గ్రామంలో ఉమామహేశ్వర ఆలయం ప్రాంగణంలో నిర్వహించే శివరాత్రి ఉత్సవాలకు టెక్కలికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ సీపాన శీనుబాబు రూ.32వేలు విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని గ్రామ పెద్దలకు శుక్రవారం అందజేశారు. ఆయనతో పాటు బడే రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

అన్ని వీధులకూ సిసి రోడ్లు

సర్పంచ్ సంజీవరావు

కోటబొమ్మాళి: మేజరు పంచాయతీ పరిధిలోని అన్ని విధులకూ సిసి రోడ్డు, డ్రెయినేజీలు నిర్మిస్తున్నట్లు కోటబొమ్మాళి మేజరు పంచాయతీ సర్పంచ్ కాళ్ల సంజీవరావు అన్నారు. శుక్రవారం కోటబొమ్మాళిలో నూతన కాలనీలో డ్రెయినేజీ పనులను ఆయన ప్రారంభించారు. సంజీవరావు మాట్లాడుతూ నూతన కాలనీలో విద్యుత్, మంచినీటి సదుపాయం, రోడ్లు, కాలువలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రఘుపాత్రిని యోగేశ్వరరావు, కొత్తమ్మతల్లి దేవాదాయశాఖ కమిటీ చైర్మన్ బోయిన కృష్ణారావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం

పొందూరు: ప్రకతి వ్యవసాయ పద్ధతిలో నవధాన్యాల సాగుతో ఆరోగ్యవంతమైన పంటను ఉత్పత్తి చేయడంతో పాటు నేలను సారవంతం చేసి అధిక దిగుబడిని సాధించవచ్చని ప్రకతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ కంబాపు కృష్ణ అన్నారు. మండలంలోని తండ్యాం గ్రామంలో ప్రకృతి వ్యవసాయం, నవధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫీల్డ్‌అసిస్టెంట్ భాస్కరరావు, ఉపాధి హామీ కూలీలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



నవధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న కంబాపు కృష్ణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



మాట్లాడతున్న రెడ్డి శాంతి

ప్రజాశక్తి - నరసన్నపేట

రానున్న ఎన్నికల్లో విజయానికి వారధులు మీరేనని వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని ఉర్లాంలో శుక్రవారం గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను తీసుకువెళ్లాలని సూచించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు ప్రగతి చక్రాల్లా పరుగులు పెడుతున్నాయని అన్నారు. సమన్వయంతో పని చేసి, లక్ష్యాలను సాధించాలన్నారు. నరసన్నపేట మండల అధ్యక్షునిగా లుకలాపు రవిని నియమించారు. కార్యక్రమంలో జెసిఎస్ కన్వీనరు ఎస్.నర్సింగరావు, ఎ.మురళీధర్, జెడ్‌పిటిసి చింతు అన్నపూర్ణ, పి.నరసింహమూర్తి, లక్ష్మి, ఈశ్వరరావు, రంజిత్‌కుమార్, చింతల వెంకటరమణ, పి.రాజారావు, ప్రభాకర్, యాబాజీ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

మీ పాత్రే కీలకం: దువ్వాడ

కోటబొమ్మాళి: రానున్న ఎన్నికల్లో మీరే కీలకమని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం తర్లిపేట సచివాలయంలో పరిధిలోని జీయన్నపేట, బొడ్డపాడు, బమ్మిడిపేట గ్రామాల్లో సర్పంచ్, ఎంపిటిసి, వార్డు మెంబర్లు, గృహసారథులు ప్రజల ఇళ్లకు వెళ్లి పలు విషయాలు చర్చించారు. అందరం కలిసి పార్టీ విజయం కోసం ఇప్పటినుంచే కష్టపడి పనిచేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, జి.నాగభూషణరావు, దుక్క రోజారామకృష్ణ, సర్పంచ్‌లు బలగ సూర్యారావు, కాళ్ల సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

సైనికుల్లా పనిచేయాలి

మెళియాపుట్టి: సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు జగనన్న సైన్యంలా పనిచేసి సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. స్థానిక కమలా కళ్యాణ మండపంలో శుక్రవారం కన్వీనర్లు, గృహ సారథులకు శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థి సీతమ్మ రాజుసుధాకర్, ఉదయ్‌కుమార్, ఎండయ్య, పల్లి యోగి, యు.బాలకృష్ణ, ఎవి.సురేష్, గణపతి ప్రధాన్, బూత్ కమిటీ కన్వీనరు మునిరావు, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై అవగాహన

కొత్తూరు: హిరమండలం, ఎల్ఎన్‌పేట, పాతపట్నం, మెళియాపుట్టి, మన్యం జిల్లా, భామిని, కొత్తూరు మండలాలకు చెందిన గిరిజన యువతకు భూ సమస్యలపై వెలుగు కార్యదర్శి బి.సంజీవరావు, కె.దాస్‌నాయుడు భూ సమస్యలపై రెండు రోజులుగా అవగాహన కల్పించారు. పల్లం, మెట్టు భూమి, పోరంబోకు, అసైన్డ్ భూమి, ప్రభుత్వ స్వాధీనంలో ఖాళీగా ఉన్న భూమి, 1977/9 చట్టం, వ్యవసాయం కోసం, ఇల్లులేని నిరుపేదలకు భూమి ఇచ్చుటపై అవగాహన కల్పించారు. 1908 నిషేధిత భూ చట్టం, అసైన్డ్ భూమి, ప్రభత్వ భూమి, దేవాదాయ భూమి, మిగులు భూములును వివరించారు. 1బి లేకపోతే జరిగే నష్టం, ఎఫ్ఎంబి, అటవీ హక్కుల చట్టం ద్వారా భూ పంపిణీ ఎలా చేస్తారో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎ.చిరంజీవిరావు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సంజీవరావు

సస్యరక్షణతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - పలాస

జీడిలో సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధించొచ్చని ఉద్యానశాఖ అధికారి సిహెచ్ శంకర్ రైతులకు సూచించారు. మండలంలోని సుమ్మాదేవి, బొడ్డపాడు గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఉద్దానంలో జీడి మామిడి సస్యరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో కురుస్తున్న పొగ మంచు, టీ దోమ ప్రభావంపై జీడి మామిడి రైతులకు అవగాహన కల్పించారు. జీడి మామిడి లేత చిగురు మొగ్గ, పూత దశలలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. తేనె మంచు పొగ మంచు ప్రభావంతో పంట నష్టపోకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి దశలోనూ పిచికారి చేసినప్పుడు సర్ఫ్ లేదా షాంపూ మీరు కలిపి పిచికారి చేయడం వల్ల ఫలితం ఉంటుందన్నారు. ప్రతి రోజూ రైతులు తోటలో టీ దోమ పిండివల్లి తామర పురుగులు ఉధతి పరిశీలించి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మచ్చ ధనరాజు, జెడ్‌పిటిసి రత్నాలు, బొడ్డపాడు ఎంపిటిసి మద్దిల పాపారావు, తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న శంకర్

ఘనంగా ఫేర్‌వెల్

ప్రజాశక్తి - జలుమూరు

చల్లవానిపేట జంక్షన్ సమీపంలోని ఎంఎస్ఎన్ స్కూల్లో ప్రిన్సిపాల్ మామిడి సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా ఫేర్‌వెల్ నిర్వహించారు. అందులో భాగంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కతిక కార్యక్రమాలు అలరించాయి. అప్పా జిల్లా కౌన్సిల్ చైర్మన్ గణపతిరావు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. 'సిక్స్' యూట్యూబ్ మూవీలో నటించిన దుంగ రమణ, జర్నలిస్ట్ విశ్వేశ్వరరావు, హోటల్ యజమాని పొట్నూరు జనార్ధనరావుకు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గణపతిరావు

ఇళ్ల నిర్మాణానికి ఒప్పందం

ప్రజాశక్తి -బూర్జ

మండలంలోని అల్లిన గ్రామంలో ఇళ్ల నిర్మాణానికి ఒప్పందం కుదిరింది. 16 మందికి జగనన్న గృహాలు మంజూరయ్యాయి. వారికి ఆర్థిక స్థోమత లేకపోవడంతో నిర్మాణ పనులు చేపట్టలేదు. సర్పంచ్ ప్రతినిధి మహేష్, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాంప్రసాద్ అధ్యక్షతన లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఒక్కో ఇంటికి రూ.2.50 లక్షలు చొప్పున 16 ఇళ్లకు రూ.40 లక్షలతో ఇళ్ల నిర్మాణానికి కాంట్రాక్టరుతో ఒప్పందం కుదిరింది. వారితోపాటు సెక్రటరీ రాజారావు, వెల్ఫేర్ అసిస్టెంట్ ధనలక్ష్మి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆడిట్ తప్పనిసరి

ప్రజాశక్తి - ఆమదాలవలస

గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని సంఘాలకు ఆడిట్ తప్పనిసరిని ఎపిఎం పైడి కూర్మారావు తెలిపారు. శుక్రవారం మండల మహిళా సమైక్య కార్యాలయంలో అధ్యక్షులు తమ్మినేని ధనలక్ష్మి ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ సంఘాలు, స్వయంశక్తి సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు పంచ సూత్రాలు పాటిస్తూ 'ఏ' గ్రేడ్‌లోనికి వచ్చేలా చేయాలని సూచించారు. ప్రతి సంఘం క్రమం తప్పకుండా షెడ్యూలు ప్రకారం సమావేశాలు ఏర్పాటు చేసుకోవడం, మీటింగు జరుగుతున్నప్పుడే అందరి సమక్షంలో లావాదేవీలు జరపడం, పొదుపులు, అప్పులు కట్టుకోవడం, పుస్తక నిర్వహణ సక్రమంగా ఉండాలని తెలిపారు. సంఘం సమావేశంలోనే తన సొంత నిధుల నుంచి అవసరమైన సభ్యులకు పొదుపు అప్పులు ఇచ్చుకోవాలని, తిరిగి వాయిదాల ప్రకారం సంఘం ఖాతాకు తిరిగి జమ చేయించుకోవాలని తెలిపారు. సొంత నిధులు వాడుకున్న తరువాత అవసరం మేరకు గ్రామ సంఘం ద్వారా శ్రీనిధి రుణాలను వినియోగించుకోవాలని సూచించారు. బ్యాంకు అప్పుకి వెళ్లేముందు సంఘం సమావేశమై ఆదాయాభివద్ధి కార్యక్రమాలకు మాత్రమే మైక్రో క్రెడిట్ ప్లాన్ ప్రకారం అందరి ఆమోదంతో అప్పులు వాడుకొని వాయిదా ప్రకారం తిరిగి చెల్లించాలన్నారు. ఇంటర్నల్ లెండింగ్ జరగని సంఘాలకు గ్రేడింగులో మార్కులు రాక, వెనుకబడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల సమాఖ్య ప్రతినిధులు రేణుక, వేనమ్మ ,అకౌంటెంట్ కళ్యాణి ,క్లస్టర్ కోఆర్డినేటర్లతోపాటు వివో ఏలు తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎపిఎం